సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 7 । జూన్ । 2025



నేడు బక్రీద్

శనివారం బక్రీద్ పండుగకు ముస్లింలు సిద్ధమయ్యారు. ఇప్పటికే మసీదులు, ఈద్గాలలో ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు.



చీనీ టన్ను రూ.33,300

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.33,390, కనిష్టంగా రూ.2,500 ప్రకారం ధర పలికాయి.

గరిష్టం/కనిష్టం

38.4°/22.1°

జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. గాలివేగం తగ్గడంతో ఉక్కపోత కూడా పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

మొక్కల పెంపకంతో ఎడారి నివారణ

- 'నాసిన్'లో మొక్కలు నాటిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



నాసిన్‌లో మొక్కలు నాటుతున్న కేంద్రమంత్రి

గోరంట్ల: మొక్కలు విరివిగా నాటడం వల్ల ఎడారి నివారణ సాధ్యమవుతుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. అతితక్కువ వర్షపాతం నమోదయ్యే రాజస్థాన్‌లోని జైసల్మీర్‌లోనూ ఎడారి ఛాయలు ఏర్పడకుండా కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందని ఆమె వివరించారు. అందువల్ల ఉమ్మడి అనంతపురం జిల్లాలోనూ విరివిగా మొక్కలు నాటడం వల్ల జిల్లాను సస్యశ్యామలం చేయవచ్చన్నారు. శుక్రవారం ఆమె పాలసముద్రం సమీపంలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఎక్సైజ్ అండ్ నార్కోటిక్స్ (నాసిన్) సంస్థలో జరిగిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలసీతారామన్ విద్యార్థులు, రైతులతో కలసి నాసిన్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఉమ్మడి అనంతపురం జిల్లాలోనూ తరచూ తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడం వల్ల కరువు పరిస్థితులు ఏర్పడుతున్నాయని, వాటి అధిగమించడానికి చెట్లను విరివిగా పెంచాలని సూచించారు. ఈ క్రమంలోనే నాసిన్ సంస్థలో జపాన్ టెక్నాలజీతో మొక్కలు నాటి పర్యావరణ, పరిరక్షణకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావులకేశవ్, నాసిన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

9న 'షైనింగ్ స్టార్స్' పురస్కారాలు

- జిల్లా వ్యాప్తంగా 225 మంది విద్యార్థుల ఎంపిక
- ఒక్కో విద్యార్థికి రూ.20 వేల చొప్పున నగదు పురస్కారం

పుట్టపర్తి: పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రభుత్వం 'షైనింగ్ స్టార్స్' పురస్కారాలతో సత్కరిస్తోంది. ఇందుకోసం 225 మందిని అధికారులు ఎంపిక చేశారు. జిల్లాలో 32 మండలాలకు సంబంధించి 186 మంది పదో తరగతి విద్యార్థులు, మరో 39 మంది ఇంటర్ విద్యార్థులు ఉన్నారు. ఒక్కో విద్యార్థికి రూ. 20 వేల చొప్పున నగదు పురస్కారం అందించనున్నారు. ఈనెల 9వ తేదీన కొత్తచెరువు సమీపంలోని వెంకటేశ్వర కళ్యాణమండపంలో పురస్కారాల ప్రదానోత్సవం ఏర్పాటు చేసినట్లు డీఈఓ కృష్ణప్ప శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు విద్యార్థులకు సమాచారం పంపామన్నారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు 9న కౌన్సెలింగ్

హిందూపురం టౌన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో (2025–26 విద్యా సంవత్సరం) జూన్ 9న అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు హిందూపురం ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ రాయపురెడ్డి తెలిపారు. శ్రీకంఠపురం ఝాన్సీ లక్ష్మీ బాయ్ పురపాలక ప్రాథమిక పాఠశాల ఆవరణలోని ప్రభుత్వ ఐటీఐలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు. 9వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 1–30 ర్యాంకుల వారికి, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు 31 – 60 ర్యాంకుల వారికి కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. వివరాలకు 9440258629, 9490445744 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

అంతులేని అరాచకాలు

అసాంఘిక శక్తులకు అడ్డా ఉమ్మడి జిల్లా

- రాప్తాడు నియోజకవర్గంలో 3 నెలల్లోనే 3 హత్యలు
- తాజాగా రామగిరి మండలంలో దళిత బాలికపై అత్యాచారం
- తాడిపత్రిలో ఐచర్ వాహనంలో బాలికపై యువకుడి అత్యాచారం
- పుట్లూరు మండలం అరకటివేములలో పసికందుపై అత్యాచారయత్నం
- అన్ని కేసుల్లోనూ టీడీపీ కార్యకర్తలే ప్రధాన నిందితులు



సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి సర్కారు పగ్గాలు చేపట్టాక ఉమ్మడి అనంతపురం జిల్లాలో దారుణాలు జరుగుతున్నాయి. శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయి. హత్యలు, అత్యాచారాలు అలజడి రేపుతున్నాయి. అత్యాచారాల నేపథ్యంలో మహిళలు బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. ఇక అధికార బలంతో టీడీపీ నాయకులు ప్రత్యర్థులపై విరుచుకుపడుతున్నారు. హత్యలు, అత్యాచారాల ఘటనల్లో ఎక్కువగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తలే ప్రధాన నిందితులుగా ఉన్నారు.

హత్యలతో అరాచకం

రాప్తాడు నియోజకవర్గ టీడీపీ నాయకుల అధికార దాహానికి సామాన్యులు బలవుతున్నారు. ఈ ఏడాది మార్చి 30న లింగమయ్య అనే వైఎస్సార్‌సీపీ కార్యకర్తను కొట్టి చంపారు. ఆ తర్వాత నెల రోజులు గడవకముందే రాప్తాడు మండల కేంద్రం సమీపంలో నారాయణరెడ్డి, ముత్యాలమ్మ దంపతులను భూతగాదా పేరుతో నరికిచంపారు. దీంతో జిల్లాలో ఒక్కసారిగా ఫ్యాక్షన్ హత్యలు పురుడు పోసుకున్నట్టు అయింది. తాజాగా అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌తో తనకు ప్రాణహాని ఉందని టీడీపీకే చెందిన సుధాకర్ నాయుడు ఎస్పీకి ఫిర్యాదు చేయడం జిల్లాలో కూటమి పార్టీ అరాచకాలను అంచనా వేయొచ్చు. అసాంఘిక శక్తులకు ఉమ్మడి అనంతపురం జిల్లా అడ్డాగా మారింది.

అత్యాచారాల పరంపర..

❒ 2024 జూన్ 24

అనంతపురం జిల్లా పుట్లూరు మండలం అరకటివేములలో టీడీపీ కార్యకర్త రవితేజ ఓ బాలికను అపహరించి తాడిపత్రి మార్కెట్‌యార్డ్ వద్ద ఐచర్ వాహనంలోకి తీసుకువెళ్లి తన స్నేహితుడు నాగేంద్రతో కలసి అత్యాచారం చేశాడు. బాధిత కుటుంబం ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదు. ఆ కుటుంబం ఆందోళన చేయడంతో 8 రోజుల తరువాత అంటే జూలై 2న పోలీసులు కేసు నమోదు చేశారు. కానీ కేసు ఉపసంహరించుకోవాలని బాధితురాలి కుటుంబాన్ని టీడీపీ నేతలు బెదిరించారు.

❒ 2024 అక్టోబర్ 13

హిందూపురం నియోజకవర్గం నల్లబొమ్మనపల్లిలో అత్తాకోడలిపై సామూహిక అత్యాచారం జరిగింది. నిర్మాణంలో ఉన్న పేపర్‌మిల్లు సెక్యూరిటీగా ఓ కుటుంబం ఉంది. ఈ కుటుంబంలోని ఉన్న అత్తాకోడలును కాళ్లు చేతులూ కట్టేసి నలుగురు వ్యక్తులు అత్యాచారం చేశారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేసి మరీ ఈ ఘాతుకానికి పాల్పడ్డారంటే పరిస్థితి అంచనా వేయొచ్చు.

❒ 2025 ఏప్రిల్ 23

పుట్లూరు మండలం అరకటివేముల గ్రామానికి చెందిన ప్రసాద్ అనే 50 ఏళ్ల వ్యక్తి మూడేళ్ల బాలికపై అత్యాచారయత్నం చేసినట్లు కేసు నమోదైంది. ఈ కేసులో నిందితుడు ప్రసాద్‌ను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ పంపారు.

❒ 2025 మే 5

పుట్లూరు మండలం మడుగుపల్లిలో 14 ఏళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన 51 ఏళ్ల వ్యక్తి అత్యాచారయత్నం చేశాడు. బాలిక బహిర్భూమికి వెళుతుండగా గమనించిన వెంకటరాయుడు అనే వ్యక్తి అత్యాచారం చేయబోయాడు. పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

❒ 2025 జూన్ 5

రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో ఓ దళిత బాలికపై 14 మంది యువకులు అత్యాచారం చేశారు. బాలిక గర్భిణీ కావడంతో విషయం బయటపడింది. బాలికకు తండ్రి చనిపోవడం, తల్లి మానసికంగా బాగలేకపోవడంతో ఏమీ చేయలేకపోయింది. ఇప్పుడా బాలిక ఆరు నెలల గర్భిణి. నిందితులందరూ టీడీపీ వారే. పరిటాల సునీతకు అనుచరులుగా ఉన్నారు.

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు

- బాలికపై అత్యాచార ఘటన కలచి వేసింది
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్



పెనుకొండ రూరల్: చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కార్ పాలనలో రాష్ట్రంలోని మహిళలు, బాలికలకు రక్షణ కరువైందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీమంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో దళిత బాలికపై జరిగిన అత్యాచార ఘటన తనను కలిచి వేసిందన్నారు. నిందితులు ఎవరైనా కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె స్థానిక మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతోందన్నారు. అత్యాచారాలు, లైంగిక వేధింపులతో మహిళలు బయట తిరగలేని పరిస్థితి నెలకొందన్నారు. రాత్రి వేళల్లోనే కాదు పగలు కూడా బాలికలు, మహిళలు బయటకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడుగుర్రాలపల్లికి చెందిన దళిత బాలికపై జరిగిన కీచకపర్వం క్షమించరానిదన్నారు. నిందితులందరినీ కఠినంగా శిక్షించాలని, బాలిక కుటుంబానికి తక్షణం రక్షణ కల్పించాలని ఉషశ్రీచరణ్ కోరారు. పోలీసులు కూడా ఈ ఘటనపై నిష్పక్షపాతంగా వ్యవహరించి బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు.

బక్రీద్‌ను ఆనందంగా జరుపుకోండి

- ఎస్పీ రత్న పిలుపు



పుట్టపర్తి టౌన్: బక్రీద్ పండుగను ముస్లింలు ప్రశాంత వాతావరణంలో ఆనందంగా జరుపుకోవాలని ఎస్పీ రత్న సూచించారు. జిల్లాలోని ముస్లింలందరికీ ఆమె బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గోవధ చేయరాదని సూచించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలతో సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

సజావుగా పోలీసుల బదిలీలు

- 60 మందికి పోస్టింగ్

పుట్టపర్తి టౌన్: ఒకే స్టేషన్‌లో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసకున్న ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లకు స్థాన చలనం కల్పిస్తూ ఎస్పీ రత్న ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసు బదిలీల్లో భాగంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ రత్న ఆధ్వర్యంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. 12 మంది ఏఎస్ఐలు, 18 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 30 మంది కానిస్టేబుళ్లకు కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఐదేళ్ల పూర్తి చేసుకున్న వారి జాబితా సిద్ధం చేసి సీనియార్టీ ప్రకారం ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా ప్రభుత్వ నిబంధనల ప్రకారం బదిలీలు చేపట్టినట్లు ఎస్పీ రత్న తెలిపారు. కార్యక్రమంలో డీపీఓ ఏఓ సుజాత, సూపరింటెండెంట్ మల్లికార్జున, స్పెషల్‌బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, ఆర్ఐ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు తేలికపాటి వర్షసూచన

అనంతపురం అగ్రికల్చర్: రాగల ఐదు రోజులూ ఉమ్మడి అనంతపురం జిల్లాకు తేలికపాటి వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7 నుంచి 11 తేదీ వరకు 0.2 మి.మీ నుంచి 12.9 మి.మీ మేర వర్షసూచన ఉందన్నారు. అందులో ఈనెల 10న 12.9 మి.మీ సగటు నమోదు కావొచ్చన్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు 36 డిగ్రీల నుంచి 37.5 డిగ్రీలు, కనిష్టం 24.6 డిగ్రీల నుంచి 26.2 డిగ్రీల మధ్య నమోదు కావచ్చని తెలిపారు. గంటకు 12 నుంచి 20 కిలోమీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలులు వీస్తాయని వెల్లడించారు.

అర్ధరాత్రి దాకా పదోన్నతుల కౌన్సెలింగ్



శారదా స్కూల్ ఆవరణలో రాత్రి 11 గంటల సమయంలో ఎదురు చూస్తున్న టీచర్లు



ఆర్జేడీతో వాగ్వాదం చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఎస్జీటీ కేడర్ నుంచి స్కూల్ అసిస్టెంట్ కేడర్లకు పదోన్నతులు కల్పించేందుకు శుక్రవారం అనంతపురంలో నిర్వహించిన కౌన్సెలింగ్ అర్ధరాత్రి దాకా కొనసాగింది. అన్ని యాజమాన్యాల పరిధిలోని 686 పోస్టుల భర్తీకి కౌన్సెలింగ్ సాగింది. మున్సిపల్ పాఠశాలల్లో 304 పోస్టులు, మున్సిపల్ కార్పొరేషన్‌లో 52 పోస్టులు, ప్రభుత్వ పాఠశాలల్లో 26, జిల్లా పరిషత్ పాఠశాలల్లో 304 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నారు. మున్సిపల్, కార్పొరేషన్ స్కూళ్లలో పోస్టులకు 1:2, ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పోస్టులకు 1:3 రేషియో ప్రకారం టీచర్లను సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచారు. అన్ని యాజమాన్యాల పాఠశాలల్లోనూ పదోన్నతులకు పెద్దగా ఆసక్తి చూపలేదు. సౌకర్యవంతమైన ఖాళీలు లేకపోవడంతో చాలామంది పదోన్నతులు తీసుకోలేదు. మునిసిపల్, కార్పొరేషన్ టీచర్లకు కేఎస్ఆర్ స్కూల్‌లో, జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల టీచర్లకు శారదా స్కూల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్ కౌన్సెలింగ్‌ను పర్యవేక్షించారు. కౌన్సెలింగ్ హాజరైన టీచర్లతో ఆప్షన్ తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. వారందరికీ శనివారం పదోన్నతుల ఉత్తర్వులు జనరేట్ కానున్నాయి. వీరితో పాటు బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్లు, పీఎస్‌హెచ్‌ఎంలు (స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లు) అందరూ శుక్రవారం వారి పాత స్కూళ్లలో రిలీవై.. శనివారం ఉదయం కొత్త స్కూళ్లల్లో చేరాల్సి ఉంటుందని తెలిపారు. కాగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్కూల్ అసిస్టెంట్ల బదిలీలకు సంబంధించి శుక్రవారం తెల్లవారుజామున నుంచే ఉత్తర్వులు జనరేట్ అయ్యాయి. ఏ సబ్జెక్టులో ఎంతమంది బదిలీ అయ్యారనే వివరాలను రాత్రి 12 గంటలు దాటినా విద్యాశాఖ అధికారులు ప్రకటించకపోవడం గమనార్హం. కాగా, కార్పొరేషన్ పరిధిలోని స్కూళ్లకు స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల విషయంలో అధికారులు రోస్టర్ పాటించడం లేదంటూ రాష్ట్రోపాధ్యాయ సంఘం నాయకులు వాదనకు దిగారు. కేఎస్ఆర్ బాలికల పాఠశాలలో జరిగిన కౌన్సెలింగ్‌ను అడ్డుకున్నారు. అక్కడే ఉన్న ఆర్జేడీ... ఈ విషయంపై జేడీ సర్వీసెస్‌తో ఫోన్‌లో మాట్లాడి స్పష్టత ఇచ్చారు. అనంతరం కౌన్సెలింగ్ ప్రారంభమైంది.

నిబంధనలకు పాతర

అనువైన స్థానాల కోసం కొందరు టీచర్లు అడ్డదారులు తొక్కుతున్నారు. బదిలీల చట్టం జీఓ 22 ప్రకారం మే 31 నాటికి 40 ఏళ్లు నిండిన వారికి మాత్రమే 'అన్‌మ్యారెడ్ ఉమెన్' (అవివాహిత) కేటగిరీ కింద 5 స్పెషల్ పాయింట్లు పొందేందుకు అర్హులు. ఈలెక్కన 1985 మే 31కి ముందు జన్మించి ఉండాలి. అయితే 1987 నుంచి 1999 మధ్య జన్మించిన వారు దాదాపు 30 మంది మహిళా టీచర్లు 'అవివాహిత మహిళ' కేటగిరీ కింద పాయింట్లు పొందేందుకు ప్రయత్నం చేస్తున్నారు. బ్రహ్మసముద్రం, రొళ్ల, డి.హీరేహాళ్, గుమ్మఘట్ట, మడకశిర, రాయదుర్గం, అమడగూరు, కంబదూరు, అగళి, గుడిబండ, కుందుర్పి మండలాల్లో పని చేస్తున్న మహిళా టీచర్లు ఎక్కువగా అక్రమంగా పాయింట్లు పొందేందుకు దరఖాస్తు చేసుకున్నారు. తాత్కాలిక సీనియార్టీ జాబితాను పరిశీలించిన పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. అనర్హుల జాబితాను సోషల్ మీడియా వేదికగా వైరల్ చేస్తున్నారు.

'సాయి మిషన్'లో మహిళలదే కీలక పాత్ర

- కోల్‌కతా హైకోర్టు జడ్జి జస్టిస్ అనన్యా బంధోపాధ్యాయ
- ప్రశాంతి నిలయంలో ఘనంగా ప్రారంభమైన గ్లోబల్ మహిళా సదస్సు
- మూడురోజుల పాటు జరిగే కాన్ఫరెన్స్‌కు హాజరైన 18 దేశాల మహిళలు





ప్రసంగిస్తున్న జడ్జి జస్టిస్ అనన్యా బంధోపాధ్యాయ, సదస్సులో పాల్గొన్న మహిళలు


ప్రశాంతి నిలయం: అమ్మలా ప్రేమ పంచి ఆధ్యాత్మిక, సేవా పరిమళాలు వెదజల్లిన సత్యసాయి స్ఫూర్తిని కొనసాగిస్తూ సత్యసాయి మిషన్‌ను ముందుకు నడపడంలో మహిళలు కీలక పాత్ర పోషించాలని కోల్‌కతా హైకోర్టు జడ్జి జస్టిస్ అనన్యా బంధోపాధ్యాయ పిలుపునిచ్చారు. సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్, సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రశాంతి నిలయంలో అంతర్జాతీయ మహిళా సదస్సు ప్రారంభమైంది. 'శ్రీ సత్యసాయి మహిళా విభాగ్–ది విజనరీస్ ఆఫ్ ది సాయి మిషన్' అన్న థీమ్‌తో మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ సదస్సుకు 18 దేశాలకు చెందిన వేలాది మంది మహిళలు, సత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత ప్రత్యేక పూజల అనంతరం సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు సతీమణి హిమవాహిని , సత్యసాయి బాలవికాస్ జాతీయ కోఆర్డినేటర్ కమలా పాండ్య, సత్యసాయి సేవా సంస్థల జాతీయ కోఆర్డినేటర్ శిబాలతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి కాన్ఫరెన్స్ ప్రారంభించారు.

మహిళలపై సత్యసాయికి అపార నమ్మకం..

అనంతరం కోల్‌కతా హైకోర్టు జడ్జి జస్టిస్ అనన్యా బంధోపాధ్యాయ మాట్లాడుతూ, సత్యసాయికి మహిళలపై అపార నమ్మకం ఉందన్నారు. అందువల్లే ఆయన తన మిషన్ రూపకల్పనలో మహిళలకు ప్రత్యేక స్థానాన్ని ఇచ్చారని, తద్వారా మహిళల పట్ల ఉన్న నమ్మకం, వారి అభ్యున్నతి పట్ల ఆయనుకున్న చిత్తశుద్ధిని చాటారన్నారు. మనవాళి శ్రేయస్సు కోసం ప్రారంభించిన మిషన్‌లో మహిళలు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. సత్యసాయి భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన మిషన్‌ను ముందుకు నడపడం భక్తులుగా మన బాధ్యత అన్నారు. అనంతరం హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన అడిషనల్ డీజీపీ సత్వాంత్ అత్వాల్ ప్రసంగించారు. సత్యసాయి సేవా సంస్థలలో మహిళలు చురుకైన పాత్ర పోషించాలన్నారు. సత్యసాయి మహిళా లోకానికి చేసిన సేవలు మరువలేనివన్నారు. అనంతరం దేశ, విదేశాలకు చెందిన మహిళలు ప్రసంగించారు. తొలిరోజు కార్యక్రమం చివర్లో సత్యసాయి సేవా సంస్థలలో ప్రముఖ పాత్ర పోషించిన మహిళలను ఘనంగా సన్మానించారు. సత్యసాయిని కీర్తిస్తూ సంగీత కచేరీ నిర్వహించారు.

బడిబస్సూ పాస్ కావాల్సిందే!

- స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరి
- పాఠశాలల పునఃప్రారంభంలోపు ఎఫ్‌సీ చేయించుకోవాల్సిందే
- 15వ తేదీ వరకు గడువు విధించిన రవాణాశాఖ
- నేటికీ రవాణా శాఖ కార్యాలయానికి రాని 76 స్కూల్ బస్సులు
- 12 నుంచి బుక్కపట్నం 'ఏటీసీ'లో ఎఫ్‌సీ పరీక్షలు



చిలమత్తూరు: వేసవి సెలవులు ముగిసి మరో వారంలో పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఆలోపే పాఠశాల బస్సులకు ఫిట్‌నెస్ (ఎఫ్‌సీ) పరీక్షలు చేయించుకోవాలని రవాణాశాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఎఫ్‌సీ చేయించుకోని బస్సులను ఎట్టిపరిస్థితుల్లోనూ రోడ్డుపైకి ఎక్కనివ్వబోమని తేల్చిచెప్పారు. విద్యార్థులను తరలించే వాహనాలకు అన్నీ పక్కాగా ఉండాలని చెబుతున్నారు. కానీ జిల్లాలోని కొన్ని పాఠశాలల యాజమాన్యాలు బస్సుల ఫిట్‌నెస్‌పై దృష్టి సారించలేదు.

జిల్లా వ్యాప్తంగా 512 స్కూల్ బస్సులు..

జిల్లా వ్యాప్తంగా 512 ప్రైవేటు స్కూల్ బస్సులు ఉన్నాయి. ఇప్పటి వరకూ 436 బస్సులకు మాత్రమే ఆయా యాజమాన్యాలు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాయి. మిగిలిన 76 బస్సులు ఇంకా ఫిట్‌నెస్ టెస్టులు చేయించుకోవాల్సి ఉంది. ఈ నెల 15వ తేదీ వరకే గడువు ఉన్నా... ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ఆ దిశగా అడుగులు వేయడం లేదు. ఫిట్‌నెస్ ఉంటే తప్ప ఆ బస్సులు రోడ్డెక్కకూడదు. 15వ తేదీ తర్వాత ఫిట్‌నెస్ సామర్థ్యం లేని వాహనాలు రోడ్డెక్కితే సీజ్ చేస్తామని రవాణాశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. విద్యార్థుల భద్రత ప్రామాణికంగా విద్యాసంస్థలు వ్యవహరించాలంటున్నారు.

12 నుంచి బుక్కపట్నం కేంద్రంగా ఎఫ్‌సీ పరీక్షలు..

ఆర్టీఓ కార్యాలయాల్లో నిర్వహించే ఫిట్‌నెస్ పరీక్షలు ఈనెల 12వ తేదీ నుంచి జిల్లా కేంద్రం సమీపంలోని బుక్కపట్నంలో నిర్వహించనున్నారు. ప్రభుత్వం టెండరు ప్రక్రియ ద్వారా ఆటోమేటిక్ టెస్టింగ్ కేంద్రం (ఏటీసీ) నిర్వహణ బాధ్యతలు ప్రైవేటు సంస్థకు అప్పగించింది. ఈ నేపథ్యంలో ఈ నెల 12వ తేదీ తర్వాత బుక్కపట్నంలోని ఏటీసీలో ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించనున్నారు. పాఠశాలల బస్సులకూ ఇక్కడే ఎఫ్‌సీ చేయనున్నారు.

నిబంధనలు ఇవీ...

- బస్సు జీవిత కాలం తప్పనిసరిగా 15 ఏళ్ల లోపు ఉండాలి. బస్సుకు తప్పనిసరిగా పసుపు రంగు వేయించడంతో పాటు నాలుగు వైపులా పాఠశాల పేరు, ఫోన్ నంబర్ అందరికీ కనిపించేలా రాయించాలి.
- డ్రైవర్ వయస్సు 60 ఏళ్లు మించకూడదు. కనీసం ఐదేళ్ల అనుభవం ఉండి హెవీ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలి. మూడునెలలకు ఒకసారి డ్రైవర్‌కు బీపీ, షుగర్‌తో పాటు కంటిచూపు పరీక్షలు చేయించాలి. అటెండర్‌నూ తప్పక నియమించాలి .
- బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్సు ఏర్పాటు చేయాలి. అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలి.
- అగ్నిప్రమాద సమయంలో మంటలు ఆర్పేందుకు అవసరమైన ఫైర్ ఎగ్జిస్టర్స్ ఉంచాలి.
- బస్సు ఎక్కేందుకు విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పుట్‌బోర్డు ఏర్పాటు చేయాలి. కిటికీలకు బయటవైపు తప్పనిసరిగా గ్రిల్ ఏర్పాటు చేయాలి. ఇవన్నీ సవ్యంగా ఉంటేనే ఎఫ్‌సీ చేస్తారు.

16 నుంచి స్పెషల్ డ్రైవ్



బడి బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు తప్పనిసరి. అన్ని పాఠశాలల యాజమాన్యాలకూ ఈ విషయాన్ని తెలియజేశాం. ఈ నెల 16 నుంచి జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం. ఎక్కడైనా ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సు కనిపిస్తే సీజ్ చేస్తాం. బడి బస్సులన్నింటికీ ఈ నెల 15వ తేదీలోపు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలి. విద్యార్థుల భద్రతే మాకు ముఖ్యం. 12వ తేదీ తర్వాత ఫిట్‌నెస్ పరీక్షలు బుక్కపట్నంలో చేయించుకోవాల్సి ఉంటుంది.

– కరుణాసాగర్‌రెడ్డి, జిల్లా రవాణాశాఖ అధికారి

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య

సోమందేపల్లి: స్థానిక కొట్టాల ప్రాంతానికి చెందిన నాగభూషణం భార్య ఈశ్వరమ్మ(50) ఆత్మహత్య చేసుకుంది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె జీవితంపై విరక్తితో శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు పరిశీలించి, నాగభూషణం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

8న డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష

అనంతపురం: ఎస్కేయూ పరిధిలో డిగ్రీ ఐదో సెమిస్టర్‌లో ఒక సబ్జెక్టు ఫెయిల్ అయిన విద్యార్థులకు ఈ నెల 8న అనంతపురంలోని కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఇన్‌స్టంట్ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎవాల్యుయేషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుంది. ఇప్పటి వరకూ పరీక్ష ఫీజు చెల్లించని వారు రూ.2,200 చలానా, పాత హాల్‌టికెట్ తీసుకుని పరీక్ష కేంద్రానికి నేరుగా హాజరు కావచ్చు. పూర్తి వివరాలను ఆయా కళాశాల ప్రిన్సిపాళ్లను అడిగి తెలుసుకోవచ్చు. కాగా, హిందూపురంలోని ఓ పరీక్ష కేంద్రంలో ఎస్కేయూ యూజీ రెండో సెమిస్టర్ పరీక్షలో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడిన ఓ విద్యార్థిని డీబార్ చేసినట్లు ప్రొఫెసర్ రమణ తెలిపారు.

సడలుతున్న పట్టు

- బైవోల్టిన్ పట్టుగూళ్ల ఉత్పత్తిపై ప్రోత్సాహకాలు అధికం
- సీబీ రకం పట్టుగూళ్లపై అంతంత మాత్రమే
- కూటమి ప్రభుత్వంలో ఏడాదిగా అందని ప్రోత్సాహకాలు
- పట్టు రైతులకు తప్పని కష్టాలు



పట్టు రైతును కష్టాలు వెంటాడుతున్నాయి. పట్టు దారం, పట్టు గూళ్ల ధరలు నిలకడగా ఉన్నా.. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన సర్వాత సరైన ప్రోత్సాహకాలు అందకపోవడం రైతులను కలవరపరుస్తోంది. దీంతో పట్టు సాగుపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.



క్రాస్ బ్రీడ్ రకం పట్టుగూళ్లు



బైవోల్టిన్ రకం పట్టుగూళ్లు

మడకశిర: జిల్లాలోనే మడకశిర నియోజకవర్గంలో పట్టు గూళ్ల పెంపకం అత్యధికంగా ఉంటోంది. ఓ కుటీర పరిశ్రమలా విస్తరించాయి. దాదాపు 14వేల ఎకరాల్లో మల్బరీ తోటలు విస్తరించి ఉన్నాయి. నియోజకవర్గంలోని మడకశిర, అగళి, రొళ్ల, గుడిబండ, అమరాపురం మండలాల్లో దాదాపు 10వేల మంది రైతులు పట్టు పురుగుల పెంపకంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ప్రధానంగా బైవోల్టిన్, క్రాస్ బ్రీడ్ (సీబీ) రకాల పట్టు గూళ్లను ఉత్పత్తి చేస్తున్నారు.

తగ్గిన సీబీ పట్టుగూళ్ల ఉత్పత్తి..

కొన్నేళ్ల క్రితం రైతులు సీబీ రకం పట్టుగూళ్ల ఉత్పత్తికి పోటీ పడే వారు. దాదాపు 95 శాతం మంది రైతులు సీబీ రకం పట్టు సాగుకే మొగ్గు చూపేవారు. తర్వాత పట్టు పరిశ్రమ శాఖలో కొన్ని మార్పులు చోటు చేసుకున్నాయి. అనంతరం ప్రభుత్వం విదేశీ రకమైన బైవోల్టిన్ పట్టుగూళ్ల ఉత్పత్తికి విశేషంగా ప్రోత్సాహకాలను అందజేస్తూ వచ్చింది. దీంతో రైతులు సీబీ రకాన్ని వదిలి బైవోల్టిన్ వైపు మొగ్గు చూపుతూ వచ్చారు. ప్రస్తుతం జిల్లాలో 5 శాతం మంది రైతులు మాత్రమే సీబీ రకం పట్టుగూళ్లను ఉత్పత్తి చేస్తున్నారు. రాష్ట్రంలోనే పట్టుగూళ్ల అమ్మకాలకు కేంద్ర బిందువుగా మారిన హిందూపురం మార్కెట్‌లో రోజు వారీ అమ్మకాలను పరిశీలిస్తే సీబీ రకం పట్టు గూళ్ల అమ్మకాలు పూర్తిగా పడిపోయాయి. ఈ ఏడాది మే 30 నుంచి ఇప్పటి వరకూ హిందూపురం మార్కెట్‌లో లావాదేవీలను పరిశీలిస్తే సీబీ రకం పట్టుగూళ్లు కేవలం 44 కిలోలు మాత్రమే అమ్మకానికి రాగా, బైవోల్టిన్ రకం పట్టుగూళ్లు 26,884 కిలోలు వచ్చాయి.

తక్కువ ఖర్చుతో బైవోల్టిన్ పట్టు గూళ్ల ఉత్పత్తి..

సీబీ రకం పట్టుగూళ్ల సాగుతో పోల్చుకుంటే బైవోల్టిన్ సాగుకు ఖర్చు తక్కువగా ఉంటోంది. బైవోల్టిన్ పట్టుగూళ్ల ఉత్పత్తికి కూలీల అవసరం చాలా తక్కువ, అంతేకాక బైవోల్టిన్ పట్టు గూళ్ల ఉత్పత్తిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సాహకాలను అధికంగా ఇస్తున్నాయి. కిలో బైవోల్టిన్ పట్టుగూళ్లను ప్రభుత్వ మార్కెట్లో విక్రయిస్తే అదనంగా రూ.50 అందుతుంది. సీబీ రకం పట్టుగూళ్లు కిలో పై కేవలం రూ.10 మాత్రమే వస్తుంది. మార్కెట్‌లో సీబీ రకం కంటే బైవోల్టిన్ పట్టుగూళ్ల ధర కూడా అధికంగా ఉంటోంది. కిలోపై రూ.150 నుంచి రూ.200 వరకు ధరలో తేడా ఉంటోంది. సీబీ రకం పట్టుగూళ్లు కిలో గరిష్ఠంగా రూ.400 పలికితే... బైవోల్టిన్ ధర గరిష్ఠంగా రూ.600 వరకు ఉంటోంది.

కూటమి ప్రభుత్వంలో తప్పని కష్టాలు..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ ఏడాదిలో పట్టు రైతులకు ఇప్పటి వరకూ ఎలాంటి ప్రోత్సాహకాలు అందలేదు. ప్రధానంగా బైవోల్టిన్ రైతులకు కిలోపై అదనంగా ఇచ్చే రూ.50 ప్రోత్సాహకం అందజేతలో అంతులేని జాప్యం కనబరుస్తోంది. దీంతో రూ.కోట్లల్లో ప్రోత్సాహక బకాయిలు పేరుకుపోయాయి. ప్రోత్సాహక ధనాన్ని మంజూరు చేయాలని కోరుతూ పట్టు రైతుల సంఘం నాయకులు పలుమార్లు విజయవాడకు వెళ్లి ప్రభుత్వ పెద్దలకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది.

ఈ నెలలో హిందూపురం మార్కెట్‌లో బైవోల్టిన్, సీబీ రకం పట్టుగూళ్ల అమ్మకం వివరాలు..

తేదీ	బైవోల్టిన్ (కిలో)	క్రాస్ బ్రీడ్ (కిలో)
1న	1,824	00
2న	2,194	00
3న	5,854	00
4న	6,099	00
5న	5,982	44

ప్రోత్సాహకాలు అందజేయాలి



కొన్నేళ్లుగా పట్టు గూళ్ల ఉత్పత్తితోనే జీవనం సాగిస్తున్నా. బైవోల్టిన్ రకం పట్టుగూళ్ల ఉత్పత్తికి కిలోపై అదనంగా ఇచ్చే రూ.50 ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం ఇప్పటి వరకూ అందించలేదు. గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి చూడలేదు. పట్టు రైతుల కష్టాలను ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పట్టు రైతులకు ప్రోత్సాహకాలను అందజేయాలి. – వేమారెడ్డి, పాపసానిపల్లి, మడకశిర మండలం

నష్టపోయిన రైతులను ఆదుకోండి

- జెడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో సభ్యుల డిమాండ్
- అరటి, మామిడి రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని సూచన
- చెట్లు కూలిపోతేనే పరిహారం చెల్లిస్తామని అధికారి వివరణ



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ. చిత్రంలో వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, సీఈఓ వెంకటసుబ్బయ్య

అనంతపురం సిటీ: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు అరటి, మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారని, బాధిత రైతులను నష్ట పరిహారం అందించి అన్ని విధాల ఆదుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని జెడ్పీటీసీ సభ్యులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు స్పందిస్తూ.. పూత, పిందె దశలో ఉన్న వాటికి పరిహారం వర్తించదని, చెట్లు పూర్తిగా నేలమట్టమైతేనే పరిహారం చెల్లిస్తామని చెప్పడంతో సభ్యులు ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉభయ జిల్లా స్థాయీ సంఘం-1, 2, 3, 4, 5, 6, 7 సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అధ్యక్షతన జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో శుక్రవారం జరిగింది. సీఈఓ వెంకటసుబ్బయ్య, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, గుమ్మఘట్ట జెడ్పీటీసీ సభ్యుడు మహేష్, ఉరవకొండ జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతమ్మ వేదికపై ఆశీనులయ్యారు.

తొలుత వ్యవసాయ శాఖపై చర్చ సందర్భంగా మామిడి, అరటి రైతులను ఆదుకోవాలనే అంశంపై గోరంట్ల, ఓబుళదేవరచెరువు జెడ్పీటీసీ సభ్యులు పాలే జయరాం నాయక్, దామోదర్‌రెడ్డి మాట్లాడారు. భారీ వర్షాలతో నష్టపోయిన ఉద్యాన రైతులను ఏ విధంగా ఆదుకుంటారో తెలపాలని పట్టుబట్టారు. జెడ్పీ చైర్‌పర్సన్ జోక్యం చేసుకుంటూ ఎన్ని హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి, ఎన్ని చెట్లు కూలిపోయాయ్, ఎంత మంది రైతులు నష్టపోయారో వివరాలు వెల్లడించాలని సూచించారు. అయితే ఉద్యాన శాఖ అధికారి వద్ద కనీస సమాచారం లేకపోగా, పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో సభ్యులు మండిపడ్డారు. చెట్లు కూలిపోతేనే పరిహారం ఇస్తామని చెప్పడంతో .. అంతెందుకు రైతులు చస్తేనే పరిహారం ఇస్తామని ప్రకటించండంటూ ఆవేశంతో ఊగిపోయారు. రైతులకు నాణ్యమైన కందులు సరఫరా చేయాలని గుమ్మఘట్ట జెడ్పీటీసీ మహేష్, ఓడీచెరువు జెడ్పీటీసీ దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏయే పంటలు సాగు చేయాలో రైతులకు అవగాహన కల్పించాలని నల్లమాడ జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి కోరారు. రైతు భరోసా కేంద్రాలను ఎందుకు నిర్వీర్యం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

పోషణ్ పక్వాడా నిధుల స్వాహాపై చర్యలేవీ?

పోషణ్ పక్వాడా నిర్వహణకు సంబంధించి ఒక్కో జిల్లాకు రూ.5 లక్షలు చొప్పున ఉమ్మడి జిల్లాకు రూ.10 లక్షలు మంజూరయ్యాయని, వీటిని సీడీపీఓలు నొక్కేసి తూతూ మంత్రంగా ముగించారని నార్పల జెడ్పీటీసీ నాగరత్నమ్మ, గోరంట్ల జెడ్పీటీసీ జయరాం నాయక్ ఆరోపించారు. ఆ భారమంతా సూపర్‌వైజర్ల మీద పడిందన్నారు. సీడీపీఓలపై చర్యలు తీసుకొని ప్రభుత్వం ఇచ్చిన డబ్బును సూపర్‌వైజర్లకు పంచాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ పీడీ నాగమణి స్పందిస్తూ.. వచ్చిన డబ్బును సీడీపీఓల ఖాతాల్లో జమ చేశామని ఆధారాలు చూపారు. అయితే వాళ్లు దిగమింగిన సంగతి తనకు తెలియదని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌పై చర్యలు తీసుకోండి

స్థాయీ సంఘ సమావేశానికి డుమ్మా కొట్టిన ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు చర్యలు తీసుకోవాలంటూ సభ్యులు డిమాండ్ చేశారు. ఓబుళదేవరచెరువు పీహెచ్‌సీ కూలిపోయేందుకు సిద్ధంగా ఉందని, అయినా అదే పాడుబడిన భవనంలో వైద్య సేవలు అందిస్తుండడంపై జెడ్పీటీసీ దాము ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై జెడ్పీ చైర్‌పర్సన్ కల్పించుకుంటూ.. పరిస్థితిని ప్రభుత్వానికి వివరించి, కొత్త భవనాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని శ్రీసత్యసాయి జిల్లా డీఎంహెచ్‌ఓను ఆదేశించారు.

పేద విద్యార్థులకు న్యాయం చేయండి..

జిల్లాలోని అంబేడ్కర్, ఇతర గురుకుల పాఠశాలల్లో గతంలో సీట్లు అమ్ముకున్నారని, ఈసారి ఆ పరిస్థితి లేకుండా పేద విద్యార్థులకు న్యాయం చేకూరేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ నాగరత్నమ్మ కోరారు. హాస్టళ్లలో పరిస్థితులు మెరుగుపడేలా చూడాలన్నారు. సీట్లు కావాలని ఓట్లేసిన ప్రజలు ప్రజాప్రతినిధులను ఆశ్రయిస్తుంటారని, అలాంటప్పుడు వారు సిఫారసు చేస్తే కచ్చితంగా కొన్ని సీట్లు ఇచ్చేలా చూడాలని జెడ్పీ చైర్‌పర్సన్ సూచించారు.

ఇసుక అక్రమ రవాణాపై తనిఖీలు



హిటాచీ వాహనాన్ని స్వాధీనం చేసుకుంటున్న ఆర్డీఓ మహేష్

ముదిగుబ్బ: మండలంలోని కొడవండ్లపల్లి సమీపంలో మద్దిలేరు పరీవాహక ప్రాంతం నుంచి సాగిస్తున్న ఇసుక అక్రమ రవాణాపై శుక్రవారం ఆర్డీఓ మహేష్ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు తనిఖీలు చేపట్టారు. రెండు హిటాచీలు, ఓ టిప్పర్‌ను సీజ్ చేశారు. పట్టుబడిన వాహనదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా రీచ్‌ల నుంచి ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో మైనింగ్, ఇరిగేషన్, పోలీస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణం నిలిపారు!



బాధిత విద్యార్థికి సీపీఆర్ చేస్తున్న కానిస్టేబుల్ దేవేంద్ర



చికిత్స పొందుతున్న విద్యార్థి నరసింహులు

కదిరి టౌన్: కరెంటు షాక్‌కు గురైన విద్యార్థి చనిపోయాడని అందరూ అనుకున్నారు. కుటుంబ సభ్యుల రోదనలు కూడా మిన్నంటాయి. అంతలోనే అక్కడికి వచ్చిన కానిస్టేబుల్ దేవేంద్ర సీపీఆర్ చేసి విద్యార్థి ప్రాణాలు నిలిపారు. ఈ ఘటన కదిరి పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు... పట్టణంలోని ఆర్టీఓ కార్యాలయ సమీపంలో ఆంజనేయులు అనే వ్యక్తి నూతనంగా ఇల్లు నిర్మిస్తున్నాడు. అతని కుమారుడు నరసింహులు శుక్రవారం ఇంటిపైకి ఎక్కాడు. పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ లైనును ప్రమాదవశాత్తు తాకడంతో షాక్‌కు గురయ్యాడు. తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అతను మృతి చెందాడని భావించిన కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. విషయం తెలుసుకున్న కానిస్టేబుల్ దేవేంద్ర వెంటనే అక్కడికి చేరుకుని బాలుడికి సీపీఆర్ చేయడంతో ప్రాణాలు నిలిచాయి. తర్వాత బాలుణ్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. విద్యార్థి నరసింహులు పట్టణంలోని ఓ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు.

కామాంధులను కఠినంగా శిక్షించాలి

- ఎస్పీ రత్నకు విన్నవించిన ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ



ఎస్పీ రత్నను కలసి విన్నవిస్తున్న ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ నాయకులు

ధర్మవరం: దళిత బాలికపై అత్యాచారం చేసిన కామాంధులను కఠినంగా శిక్షించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేశారు. అత్యాచారానికి గురైన బాలిక బంధువులతో కలసి ధర్మవరం పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రత్న విచారిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ రత్నను ఆయన కలసి వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. రామగిరి మండలంలోని ఏడుగుర్రాలపల్లికి చెందిన దళిత మైనర్ బాలిక పేదరికం, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు బెదిరించి అత్యాచారానికి ఒడిగట్టడం దారుణమన్నారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టడానికి హోం మంత్రి ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఎస్పీని కలిసిన వారిలో బహుజన్ సమాజ్ పార్టీ సాకే వినయ్‌కుమార్, సమత సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు సుగమంచి శ్రీనివాసులు, ప్రొగ్రెసివ్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ మంజుల నరేంద్ర, జేఏసీ నాయకులు రామకృష్ణ, గోపాల్, రాకెట్ల సూర్యనారాయణ, ముత్యాలప్ప తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత బాబురెడ్డి ఆకస్మిక మృతి




బెంగళూరులో బాబురెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్, దీపిక తదితరులు

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, పెనుకొండ నియోజకవర్గ మాజీ సమన్వయ కర్త చల్లాపల్లి బాబురెడ్డి (46) శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. మూడు రోజుల క్రితం గుండెలో నొప్పిగా ఉండడంతో బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు ఆయనకు స్టంట్ వేశారు. కోలుకుంటున్నారనుకుంటుండగానే శుక్రవారం మరోసారి గుండె పోటుకు గురై తుది శ్వాస విడిచారు. కాగా, బెంగళూరులో నివాసం ఉంటూ పెనుకొండ, హిందూపురం నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతానికి ఆయన కృషి చేశారు. మాజీ మంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అత్యంత సన్నిహితులుగా ఉండేవారు. 2011-2014 మధ్య పెనుకొండ నియోజకవర్గ సమన్వయకర్తగా పనిచేశారు. ఎంతో మంది పార్టీ నేతలు, కార్యకర్తలను ఆర్థికంగా ఆదుకున్నారు. ఆయన మృతి విషయం తెలియగానే వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్, హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక, నియోజకవర్గ నేత వేణురెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు, చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తమరెడ్డి యలహంకలోని బాబురెడ్డి నివాసానికి చేరుకుని ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు.

మీ ఊరి పక్కనే దాష్టీకం.. కనిపించలేదా?

- పరిటాల సునీతను ప్రశ్నించిన తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



రాప్తాడురూరల్: 'నీ సొంతూరు సమీపంలోనే ఉన్న ఏడుగుర్రాలపల్లిలో బాలికను 14 మంది బ్లాక్‌మెయిల్ చేసి నెలల తరబడి అత్యాచారం చేసి, గర్భవతిని చేసిన దాష్టీకం నీ దృష్టికి రాలేదా సునీతమ్మా' అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. ఏడుగుర్రాలపల్లి ఘటనపై స్పందించిన తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. 'ఈ ఘటన ఆ గ్రామంలో ప్రతి ఇంటికీ తెలిసినా నీ చెవులకు సోకలేదా.. నువ్వేమైనా నిద్రపోతున్నావా?' అని మండిపడ్డారు. ఒత్తిళ్లు.. ఆంక్షల తర్వాత వెలుగు చూసిన ఈ ఘటనపై తాము మాట్లాడుతున్నామన్నారు. బాలికకు అన్యాయం చేసిన వారు ఎవ్వరైనా సరే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఒక మహిళగా కనీస స్పందన లేకుండా... 'వైఎస్సార్ సీపీ నాయకులు బాలిక విషయంలో నీచ రాజకీయాలు చేస్తున్నారు' అని సిగ్గు లేకుండా ఎలా మాట్లాడతారని మండిపడ్డారు. నిందితులకు కఠినంగా శిక్ష పడాలంటే లాయర్లను ఏర్పాటు చేయొద్దని సునీతకు సూచించారు. బాలికకు న్యాయం చేయలేని సునీతమ్మ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

బయటకు రాని ఘోరాలెన్నో..?

ఏడుగుర్రాలపల్లి 40 ఏళ్లుగా పరిటాల రిగ్గింగ్ గ్రామంగా గుర్తింపు ఉందని ప్రకాష్‌రెడ్డి అన్నారు. పరిటాల కుటుంబంపై పోటీ చేసిన వారికి ఆ గ్రామంలో ఏజెంట్లు వెతుక్కునే పరిస్థితి ఉందన్నారు. అంత ఏకఛత్రాధిపత్యం నడుపుతున్న గ్రామంలో బాలికకు ఇంతటి అన్యాయం జరిగినా తనకు తెలియదన్న సునీత వ్యాఖ్యలను ఎవరూ నమ్మడం లేదన్నారు. పరిటాల కుటుంబం ఆధిపత్యం చలాయించే గ్రామాల్లో వెలుగులోకి వచ్చింది ఈ ఘటన ఒక్కటేనన్నారు. బయటకు రాని ఎన్నో ఘోరాలు.. నేరాలు ఉన్నాయన్నారు. రామగిరి బంగారు గనుల గుంతల్లో వందలాది శవాలున్నాయని గతంలో చెప్పుకునేవారని గుర్తు చేశారు. ఎక్కడెక్కడో చంపి తీసుకొచ్చిన శవాలను ఆ గుంతల్లో పడేసేవారని కథకథలుగా జనం చెప్పుకుంటున్నారన్నారు. పరిటాల కుటుంబం అంటే భయం ఇంకా కొనసాగుతోందన్నారు. అలాంటి కంచుకోటలో ఓ ఆడబిడ్డకు జరిగిన అన్యాయం గురించి ఓ పత్రిక వెలుగులోకి తీసుకువస్తే.. బాధితురాలికి అండగా నిలిచి ప్రతిపక్ష నాయకుడిగా తాను మాట్లాడితే రాజకీయం అంటగడుతునారని మండిపడ్డారు. అత్యాచారానికి గురైన బాలికకు న్యాయం చేయలేని నువ్వు మహిళవేనా అని పరిటాల సునీతను ప్రశ్నించారు.

పది మూల్యాంకనంలో కూటమి వైఫల్యం

- వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు అమరనాథరెడ్డి, రాజేంద్రప్రసాద్



డీఈఓ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు

పుట్టపర్తి: పదో తరగతి మూల్యాంకనం మొత్తం తప్పుల తడకగా సాగిందని, విద్యార్థుల భవిష్యత్తుతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడిందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు అమరనాథరెడ్డి, రాజేంద్రప్రసాద్ ధ్వజమెత్తారు. మూల్యాంకనంలో ప్రభుత్వ వైఫల్యం కారణంగా నష్టపోయిన విద్యార్థులకు న్యాయం చేయాలంటూ డీఈఓ కార్యాలయ సిబ్బందికి శుక్రవారం వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. ఈ ఏడాది ఏప్రిల్ 23న పదో తరగతి ఫలితాలు వెలువడ్డాయని, ఇందులో చాలా మంది విద్యార్థులు పరీక్ష తప్పటంతో పాటు మార్కులు సైతం తక్కువగా వచ్చాయని గుర్తు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 66 వేల మంది పై చిలుకు విద్యార్థులు రీ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకుంటే 11 వేల మంది విద్యార్థులు పాస్ అయ్యారని, మార్కులు కూడా బాగా పెరిగాయని పేర్కొన్నారు. దీనిని బట్టి చూస్తుంటే ఫలితాలు రికార్డు స్థాయిలో తొందరగా విడుదల చేయాలనే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నిర్ణయం కారణంగా మూల్యాంకనంలో తప్పిదాలు చోటు చేసుకున్నాయని మండిపడ్డారు. అన్ని సబ్జెక్టులలో 90 శాతం మార్కుల సాధించిన విద్యార్థిని సైతం ఫెయిల్‌గా పేర్కొనడం రేశ చరిత్రలో ఎక్కడా లేదన్నారు. ప్రభుత్వం చేత కానితనం వల్ల అనేక మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీ, ఇతర కోర్సులలో సీట్లు కోల్పోయారన్నారు. కేవలం ప్రభుత్వ వైఫల్యం కారణంగా నష్టపోయిన ప్రతి విద్యార్థికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు నరేష్‌రెడ్డి, బాబ్జాన్, భానుప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.